## పాల బిల్లులు విడుదల



కోటగిరి/ వర్ని, ఏప్రిల్ 4 : 'పాడి రైతుల ఆపసోపాలు' అనే శీర్షికన నమస్తే తెలంగాణ దినపత్రికలో గురువారం ప్రచురితమైన వార్తకు సంబంధిత శాఖ అధికారులు స్పందించారు. వర్ని, కోటగిరి మండలాలకు చెందిన పాడి రైతులకు 15రోజుల బిల్లులను విడుదల చేశారు. కోటగిరి రైతులకు రూ.1.59లక్షలు, వర్ని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం పరిధిలోని రైతులకు రూ.8లక్షలు విడుదలయ్యాయి. మొత్తం 45 రోజులకు సంబంధించిన బిల్లులు రావాల్సి ఉండగా, 15 రోజులవి మాత్రమే చెల్లించారని, మిగతా రెండు విడుతల బిల్లులు చెల్లించాలని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల అధ్యక్షులు ఉదయ్, దేవరాజు కోరారు.



మాక్లూర్‌లోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో బీఆర్‌ఎస్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్ గుప్తా, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు

# దాహం.. దాహం..

- దుర్గమ్మగుడి తండాలో తాగునీటి కష్టాలు
- నీటి కోసం పొలం బాటపడుతున్న గిరిజన కుటుంబాలు





**బిందెడు నీటి కోసం** గిరిజనులు అష్టకష్టాలు పడుతున్నారు. తాగునీటి కోసం ఎక్కడో దూరాన ఉన్న పంట పొలాల బాటపడుతున్నారు. దాహార్తిని తీర్చండి సారూ అంటూ ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని చెబుతున్నారు ఈ గిరిజనం. తాగునీటి కోసం తల్లీబిడ్డలంతా పొలాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇది కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం మైసమ్మ చెరువు తండా గ్రామ పరిధిలోని దుర్గమ్మగుడి తండాలో గిరిజనులు తాగునీటి తిప్పలు ఎదుర్కొంటున్నారనడానికి నిదర్శనం. తండాలో దాదాపు 30 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

–మాచారెడ్డి, ఏప్రిల్ 4

## బీఆర్‌ఎస్ హయాంలోనే మైనార్టీల అభివృద్ధి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

బిచ్కుంద, ఏప్రిల్ 4 : బీఆర్‌ఎస్ హయాంలోనే మైనార్టీల అభివృద్ధి జరిగిందని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. బిచ్కుంద మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో బీఆర్‌ఎస్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హన్మంత్‌షిండే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ సారథ్యంలో మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. విద్యార్థుల కోసం మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ర్టాన్ని ఏండ్లపాటు పాలించిన కాంగ్రెస్ మైనార్టీల కోసం చేసింది శూన్యమేనన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం గాలి అనిల్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షట్కార్, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ ఎంపీలుగా నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. ఒక్కసారి అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, బీఆర్‌ఎస్ నేతలు అశోక్ పటేల్, నాల్చర్ రాజు, వెంకట్‌రాంరెడ్డి, నాల్చర్ బాలు, నాల్చర్ శ్రీనివాస్, నీలు పటేల్, దుర్గారెడ్డి పాల్గొన్నారు.

## కెనాల్ కట్ట తెగిపోవడానికి కారణమైన వ్యక్తి అరెస్ట్

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 4: నిజాంసాగర్ ప్రధాన కాలువ కట్ట తెగిపోవడానికి కారణమైన వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు. ఆర్మూర్ పట్టణంలో సోమవారం తెల్లవారుజామున కట్ట తెగి పక్కనే ఉన్న కాలనీ మొత్తం నీట మునిగిన విషయం తెలిసిందే. ఓ వ్యక్తి కెనాల్ కట్టను ఆక్రమించి నిర్మాణం చేపట్టడమే కట్ట తెగిపోవడానికి కారణమంటూ సంబంధిత ఇరిగేషన్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## వడదెబ్బతో బాలుడి మృతి

ఇందల్వాయి, ఏప్రిల్ 4: ఇందల్వాయి మండలం డొంకల్ గ్రామపరిధిలోని డొంకల్ తండాలో రామావత్ అఖిల్ అనే ఐదేండ్ల బాలుడు వడదెబ్బతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం పాఠశాలకు వెళ్లిన అఖిల్ మధ్యాహ్నం తర్వాత ఇంటి సమీపంలో ఆడుకుంటూ అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించగా పరీక్షించిన వైద్యులు పల్స్ పూర్తిగా పడిపోవడంతో వడదెబ్బతో మృతి చెందినట్లు తెలిపారన్నారు. మృతుడి తల్లి అనిత వ్యవసాయ కూలీ కాగా, తండ్రి రమేశ్ బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లాడు.



అధికారులతో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి డా.శరత్

## తాగునీటి ఇబ్బందులుండొద్దు

**ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ డా.శరత్ ఆదేశం**

కామారెడ్డి/కంఠేశ్వర్, ఏప్రిల్ 4: తాగునీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి డా.శరత్ అధికారులను ఆదేశించారు. నిజామాబాద్, కామారెడ్డి కలెక్టర్ కార్యాలయాల్లో గురువారం వేర్వేరుగా తాగునీటి ఎద్దడి నివారణపై జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి నివారణకు కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక సెల్, మండల స్థాయిలో ప్రత్యేక ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేసి సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ప్రతి మండలానికి జిల్లాస్థాయి అధికారులను స్పెషల్ అధికారులుగా నియమించాలన్నారు. మండల స్థాయి అధికారులను క్లస్టర్ అధికారులుగా నియమించి వారం రోజులకోసారి తాగునీటి ఎద్దడిపై సమీక్ష నిర్వహించాలని చెప్పారు. తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కామారెడ్డి జిల్లాలోని 842 ఆవాసప్రాంతాలకు తాగునీరందేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సదాశివనగర్ మండలం మర్కల్ గ్రామ శివారులోని మిషన్ భగీరథ నీటిశుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. సమావేశాల్లో కలెక్టర్లు రాజీవ్‌గాంధీ హన్మంతు, జితేశ్ వీ పాటిల్, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, చంద్రమోహన్, అంకిత్, కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు సుజాత, మకరంద్, ట్రైనీ ఐఏఎస్ కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

## చోటా లీడర్ల చేతిలో మద్యం

- పక్కా సమాచారంతో ఎక్సైజ్ అధికారుల దాడులు
- గాంధారిలో పట్టుబడ్డ అక్రమ మద్యం
- అసెంబ్లీ ఎన్నికల్లో పంచేందుకు తెచ్చిన మద్యం.. సర్పంచ్ ఎన్నికల కోసం దాచుకున్న వైనం
- హస్తం నేతలవేనంటూ గ్రామస్తుల గుసగుసలు

గాంధారి, ఏప్రిల్ 4: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు తీసుకొచ్చిన మద్యం బాటిళ్లను చోటా మోటా నాయకులు పక్కదారి పట్టించినట్లు సమాచారం. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు ఓటర్లను ఆకర్షించేందుకు ఆయా గ్రామాల్లోని తమ అనుచరులతోపాటు గల్లీ లీడర్ల ద్వారా పెద్ద ఎత్తున మద్యాన్ని నిలువ చేసి ఉంచాయి. ఇదే అదనుగా భావించిన చాలా మంది నాయకులు భవిష్యత్తులో జరగబోయే సర్పంచ్(స్థానిక స్థంస్థల) ఎన్నికల్లో తాము పోటీ చేస్తే ఈ మద్యం ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో భారీగా లిక్కర్ బాటిళ్లను గ్రామాల్లోని తమ అనుచరుల ఇండ్లు, రహస్య ప్రాంతాల్లో దాచి ఉంచినట్లు ఆయా పార్టీల నాయకులు బహిరంగంగానే చర్చిస్తున్నారు. ఎన్నికల్లో గ్రామస్థాయిలోని చోటా మోటా లీడర్లను నమ్మి వారి వద్ద మద్యం నిలువను ఉంచితే, తప్పుడు లెక్కలు చూపించి, ఆయా పార్టీలకు చెందిన పెద్దలను మోసం చేశారని కార్యకర్తలు, నాయకులు మాట్లాడుకుంటున్నారు. గాంధారి మండలంలోని గండివేట్ గ్రామంలో పోలీసులు 180 మద్యం క్వార్టర్ బాటిళ్లను బుధవారం పట్టుకోవడంతో ఈ చర్చ మొదలైంది. పట్టుబడిన మద్యం కాంగ్రెస్ పార్టీకి చెందినవారిదేనని, త్వరలో నిర్వహించే సర్పంచ్ ఎన్నికల కోసమే నిల్వ చేసి ఉంచినట్లు గ్రామస్తులు గుసగుసలాడుతున్నారు.

**పల్లెల్లో భారీగా లిక్కర్ నిల్వలు**



గండివేట్‌లో పోలీసులు పట్టుకున్న మద్యం సీసాలు (ఫైల్)




### మద్యం నిల్వ ఉంచితే కేసులే..

అక్రమంగా మద్యం నిలువ చేసినా, బెల్టు దుకాణాలు నడిపినా కేసులు నమోదు చేస్తాం. గాంధారి మండలంతోపాటు ఎల్లారెడ్డి సర్కిల్ పరిధిలోని చాలా గ్రామాల్లో మద్యం నిల్వాలు ఉన్నట్లు తెలిసింది. అలాంటి వారిపై పక్కా సమాచారంతో దాడి చేసి మద్యం బాటిళ్లను పట్టుకుంటాం. బెల్టు షాపులు నడిపినా, అక్రమంగా మద్యం నిల్వ చేసిన వారి సమాచారం ఇవ్వాలి. సమాచారం ఇచ్చే వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం.

**- షాకీర్ హైమద్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, ఎల్లారెడ్డి**

## కాంగ్రెస్‌లో వర్గ పోరు

- కొత్తగా వచ్చిన వ్యక్తికి పార్టీ పదవి..
- అలక బూనిన సీనియర్ నేతలు
- గంటల వ్యవధిలోనే తొలగింపు
- సంతోషంతో స్వీట్లు పంచుకున్న నాయకులు



బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 4: కాంగ్రెస్ పార్టీలో వర్గ పోరు తారాస్థాయికి చేరింది. ఇటీవల పార్టీలో చేరిన వ్యక్తికి పదవి ఇవ్వడం హస్తంలో నిప్పు రాజేసింది. దీంతో 24 గంటల వ్యవధిలోనే అతడ్ని తొలగించడం ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశమైంది. మరోవైపు, ఆ నాయకుడ్ని పదవి నుంచి తొలగించడంపై స్పందించిన కొందరు నాయకులు స్వీట్లు పంచుకుని సంబురాలు జరుపుకోవడం కాంగ్రెస్‌లోని గ్రూపు రాజకీయాలను తెరపైకి తెచ్చింది. అసలేం జరిగిందంటే.. బాన్సువాడకు చెందిన పాత బాలకృష్ణ ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. అతడ్ని కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి జిల్లా అధికార ప్రతినిధిగా బుధవారం నియమించడం అంతర్గత వర్గ పోరుకు దారి తీసింది. పదేండ్లుగా ప్రతిపక్షంలో ఉండి, కాంగ్రెస్ మనుగడ కోసం పోరాడిన తమను కాదని బాలకృష్ణకు పదవి ఇవ్వడంపై సీనియర్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పదవుల కోసం పూటకో పార్టీ మారే వ్యక్తిని ఎలా నియమిస్తారని, ఇలాగైతే తాము కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తామని హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో అప్రమత్తమైన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ స్పందించారు. కొన్ని కారణాలతో పాత బాలకృష్ణను పదవి నుంచి తొలగిస్తున్నట్లు పార్టీ శ్రేణులకు సమాచారం పంపించినట్లు తెలిసింది. దీంతో కాంగ్రెస్‌లోని సీనియర్ నాయకులు మిఠాయిలు పంచుకుని సంబురాలు జరుపుకొన్నారు.

## దేవుడే దిక్కు..

- ధూప దీపాలు లేక ఆలయాలు వెలవెల
- అర్చకులకు అందని ప్రోత్సాహకం
- ఆరు నెలలుగా వేతనాలు రాలే..

*ప్రతి రోజూ దేవుడి ఎదుట దీపం వెలిగించి నైవేద్యం సమర్పించే అర్చకులకు ధూపదీప నైవేద్యం పథకం ఎంత మాత్రం ఉపయోగపడడం లేదు. డీడీఎన్ కింద రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం సమయానికి అందడం లేదు. దీంతో దేవుడి దీపానికి, ధూపానికి కష్టంగా మారింది. ధూప దీప నైవేద్య అర్చకులను ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి.*



ధూప దీపానికి ఎంపికైన ఆలయం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 4: దేవాలయాల్లో స్వామి వార్లకు ధూపం, దీపం, నైవేద్యం, నివేదన భా రంగా మారింది. అర్చకులు స్వామి వారికి నిత్యపూజలు, అర్చనలు చేయాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. ధూప దీప నైవేద్య పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం నెలనెలా ఇవ్వాల్సిన రూ. 10,000 ప్రోత్సాహకం అందకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దాతల సహకారం, అప్పు చేసి ఆలయ నిర్వహణ బాధ్యతలు చేపట్టాల్సి వస్తున్నదని అర్చకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

### ఆరు నెలలుగా అందని వేతనాలు

నిజామాబాద్ జిల్లాలో దేవాదాయ శాఖ పరిధిలో 1358ఆలయాలు ఉన్నాయి. వీటిలో నిత్య ధూప దీప నైవేద్య పథకానికి 594 ఎంపికయ్యాయి. గతేడాది జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉమ్మడి కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలో నూతనంగా మొదటి విడతగా 187 ఆలయాలను ధూప దీప నైవేద్యం పథకం కింద ఎంపిక చేశారు. అక్టోబర్ నెలలో కామారెడ్డిలో 38, నిజామాబాద్‌లో 40 ఆలయాలను ఎంపి క చేసి ఉత్తర్వులను అందించారు. అర్చకులకు రూ. 6వేలు ఉన్న ప్రోత్సాహకాన్ని కేసీఆర్ ప్రభుత్వం రూ.10వేలకు పెంచుతూ మొత్తం 78 దేవాలయాల అర్చకులకు నియామక ఉత్తర్వులు అందించారు. అక్టోబర్ నుంచి ఆరు నెలలుగా ప్రభుత్వం నుంచి రూ. 10వేలు ప్రోత్సాహకం అర్చకులకు అందడం లేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రూ.10 వేల చొప్పున అర్చకుల ఖాతాలో జమ చేయాలని జిల్లా ధూప దీప నైవేద్యం పథకం కార్యవర్గ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

### కుటుంబ పోషణ భారంగా ఉన్నది..



పెంచిన ప్రోత్సాహకం నేటికీ అందలేదు. దీంతో స్వామి వారి పూజలకు తామే సొంత ఖర్చులను భరించాల్సి వస్తున్నది. అక్టోబర్ నెల నుంచి ఆరు నెలలుగా ప్రోత్సాహకం అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది.

**- శివకుమార్, అర్చకుడు**

### వేతనాలు లేక వెలవెల..



కొత్తగా ఎంపికైన 78 ఆలయాలకు ప్రోత్సాహకాలు లేక వెలవెలబోతున్నాయి. ప్రభుత్వం వెంటనే ఆలయ అర్చకుల ఆరు నెలల ప్రోత్సాహకాలను విడుదల చేయాలని కోరుతున్నాం.

**- జె. రాచప్పస్వామి, ధూప దీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు**